## • సీయూఈటీ (పీజీ) అడ్మిట్‌కార్డులు విడుదల

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ (పీజీ) అడ్మిట్‌కార్డులు విడదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తన అధికారిక వెబ్‌సైట్‌లో అడ్మిట్‌కార్డులను పొందుపరిచింది. ఈ నెల 11 నుంచి 28 వరకు సీబీటీ పద్ధతిలో సీయూఈటీ పీజీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈసారి 4.6 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వివరాలకు https ://pgcuet.samarth.ac. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఎన్టీఏ పరీక్షల విభాగం సీనియర్ డైరెక్టర్ డాక్టర్ సాధనా పరాశర్ సూచించారు.

## • పోలీస్ ఉద్యోగం పేరిట 3 కోట్లు దోచేసిన లవర్స్

**విశాఖలో వెలుగులోకి ఘరానా మోసం**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): విశాఖలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. పోలీసుశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పోలీసుల వేషంతో నిరుద్యోగ యువతను ఓ ప్రేమజంట మోసం చేసిన ఘటన కలకలం రేపింది. అడవివరానికి చెందిన హనుమంతు సురేశ్, అతని ప్రియురాలు కలిసి పోలీసు ఉద్యోగాల ఎర చూపి.. 30 మంది నిరుద్యోగ యువత నుంచి రూ.3 కోట్లు దోచుకున్నారు. ఈ నకిలీ పోలీసు జంట ఎస్సై యూనిఫాంలో రావటం చూసి మోసపోయిన యువత మధ్యవర్తుల ద్వారా డబ్బు ముట్టజెప్పారు. ఈ కేసులో నిందితుడికి ఇప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నారు. కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ మోసానికి పాల్పడ్డట్టు గుర్తించిన పోలీసులు గురువారం నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని కమిషనర్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం వీరిని రహస్య ప్రదేశానికి తరలించి ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

## • 6.5 లక్షల విలువైన వైద్యపరికరాలు సీజ్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): లైసెన్స్ లేకుండా వైద్య పరికరాలను నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డీజీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో గుండా మహేశ్వరమూర్తి అనే డీలర్ ఎంఎస్ మెడికల్ సిస్టమ్స్ పేరుతో వైద్య పరికరాలను విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. లైసెన్స్ తీసుకోకుండానే వైద్యపరికరాలు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. నుబిలైజర్ల, స్టీమ్ స్టెరిలైజర్లు వంటివి ఇందులో ఉన్నాయని, వీటి విలువ మొత్తం రూ.6.5 లక్షల వరకు ఉంటుందని డీసీఏ డీజీ తెలిపారు. మరోవైపు సూర్యాపేట జిల్లా మట్టంపల్లిలో రమావత్ రవీంద్ర నాయక్ అనే వ్యక్తి న్యూ దుర్గా భవానీ మెడికల్ షాప్ నిర్వహిస్తూ 'హ్యాబిట్-ఫామింగ్' డ్రగ్స్‌ను అక్రమంగా తన ఇంట్లో నిల్వ చేసినట్టు గుర్తించారు. రూ.20,414 విలువైన మందులను సీజ్ చేశారు. ఇవి కూడా ఔషధాలే అయినా వైద్యుల సలహా లేకుండా ఇష్టారీతిన వినియోగిస్తే తీవ్ర మానసిక దుష్పరిణామాలకు దారి తీస్తాయని అధికారులు చెప్తున్నారు.

## • గుంటూరు డివిజన్ పరిధిలో 12 రైళ్లు రద్దు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని గుంటూరు డివిజనల్ రైల్వే ఆధ్వర్యంలో 12 రైళ్లను రద్దు చేస్తూ శుక్రవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ-గుంటూరు, గుంటూరు-మాచర్ల, మాచర్ల-నడికుడి, గుంటూరు-రేపల్లె, తెనాలి-విజయవాడ వంటి రైల్వే స్టేషన్ల మధ్య ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 7 వరకు రైళ్ల రాకపోకలు రద్దు చేసినట్టు తెలిపారు. ఆయా మార్గాలలో రైల్వే నిర్వహణ పనుల వల్ల ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నారు. నర్సాపూర్-గుంటూరు రైల్వే స్టేషన్ల మధ్య నడిచే రెండు రైళ్లను విజయవాడ-గుంటూరు మధ్య పాక్షికంగా నిలిపివేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

## • శ్రీకాకుళం జిల్లాలో విదేశీ కోతుల కలకలం

**రెండు కోతులను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ స్మగ్లర్లు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): అటవీశాఖ అధికారులు శ్రీకాకుళం జిల్లాలో రెండు విదేశీ కోతులను గుర్తించారు. వీటిని అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పశ్చిమబెంగాల్‌కు చెందిన సౌరభ్ మండల్, ధనుంజయ్‌సింగ్, ముఖేశ్‌రామ్‌గా గుర్తించారు. టెక్కలి సబ్‌డివిజన్ అటవీశాఖాధికారి నాగేంద్రరావు, కాశీబుగ్గ రేంజ్ అధికారి మురళీకృష్ణ, సిబ్బంది ఇచ్ఛాపురం చెక్ పోస్టు దగ్గర చేపట్టిన తనిఖీల్లో కోతులను గుర్తించారు. వీటిని అసోం నుంచి కోల్‌కతా మీదుగా కారులో చెన్నై తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. దక్షిణాఫ్రికాలోని ఉగాండా అటవీ జాతి సంతతికి చెందిన అరుదైన ఎల్‌హోస్ట్ ఆడ, మగ కోతులుగా అటవీ అధికారులు గుర్తించారు. కారును సీజ్ చేసిన పోలీసులు నిందితులను ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరిచారు. కోతులను కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసుకు తరలించారు.

# శ్రీశైలం డ్యామ్ భద్రతకు పెనుముప్పు!



హైదరాబాద్, మార్చి8 (నమస్తే తెలంగాణ): కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం డ్యామ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనున్నది. డ్యామ్ వద్ద ప్రమాదం తలెత్తే పరిస్థితులు నెలకొన్నా ఆంధ్రప్రదేశ్ సర్కార్ అడుగడుగునా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. నిపుణుల కమిటీల హెచ్చరికలనూ ఆ ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ఎలాంటి మరమ్మతులు చేయించకపోవడంతో రానురాను డ్యామ్ మరింత డ్యామేజీకి గురవుతుందన్న ఆందోళన నెలకొన్నది. డ్యామ్‌పై ఏబీ పాండ్యా కమిటీ, ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నిపుణుల కమిటీ హెచ్చరికలు జారీ చేశాయి. ఏబీ పాండ్యా నేతృత్వంలోని కమిటీ 2021లోనే శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌ల పరిస్థితిని పరిశీలించింది. డ్యామ్‌లపై నివేదికను సమర్పించింది. శ్రీశైలం డ్యామ్ స్పిల్‌వే నుంచి వచ్చే భారీ ప్రవాహానికి 40 మీటర్ల లోతులో ప్లంజ్‌పూల్ గొయ్యి ఏర్పడిందని, ఈ నేపథ్యంలో స్పిల్‌వే దిగువన భద్రత పనులను వెంటనే చేపట్టాలని, స్కై జంప్ బకెట్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించింది. అందుకు రూ.800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేసింది. అదే విధంగా సాగర్ డ్యామ్‌లో స్పిల్‌వే మార్గాలపై కాంక్రీటు దెబ్బతిన్నదని, గ్యాలరీలోనూ కొన్ని సీపేజీ రంధ్రాలు, కుడికాలువ హెడ్ రెగ్యులేటరీ, గేట్లు, ఒక వర్టికల్ గేటుకు మరమ్మతు చేయాలని, అందుకు దాదాపు రూ.20 కోట్లు అవసరమవుతాయని ఆ కమిటీ నివేదించింది. ఆ కమిటీ సిఫారసుల మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే నాగార్జునసాగర్ డ్యామ్ మరమ్మతు పనులు చేపట్టింది. కానీ ఏపీ సర్కార్ మాత్రం శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి మరమ్మతు పనులను ఇప్పటికీ చేపట్టలేదు. నిర్వహణను గాలికొదిలేసింది.

### ఎన్డీఎస్ఏ హెచ్చరికలు బేఖాతరు

నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌ల భద్రత పరిశీలన కోసం ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం), కేఆర్ఎంబీ, ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో కేంద్ర జలశక్తిశాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ బృందం ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో శ్రీశైలం డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఏపీ ప్రభుత్వ ప్రాజెక్టు నిర్వహణ తీరును చూసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డ్యామ్ ఎంతటి ప్రమాదకర పరిస్థితులో ఉన్నదో రెండుసార్లు తన నేవేదికల్లో ఆ కమిటీ వెల్లడించింది. తక్షణమే మరమ్మతు పనులను చేపట్టాలని సూచించింది. స్పిల్ వే దిగువన ప్లంజ్‌పూల్ మరింత లోతుకు, ఆనకట్ట పునాది వైపునకు విస్తరిస్తున్నదని, ఫలితంగా పునాది నిర్దేశిత గ్రేడ్ కంటే చాలా తక్కువకు పడిపోతున్నదని, దీంతో ఆనకట్ట స్థిరత్వం ప్రమాదకరంగా మారిందని హెచ్చరించింది.

### ఆనకట్టపై పెరుగుతున్న ఒత్తిడి

ఫౌండేషన్ గ్యాలరీ వద్ద చాలావరకు డ్రైనేజీ రంధ్రాలు పనిచేయడం లేదని, ఇది ఆనకట్టపై ఒత్తిడిని పెంచుతున్నదని వెల్లడించింది. మరికొన్ని డ్రైనేజీ రంధ్రాలు గణనీయమైన ఒత్తిడితో ఫౌండేషన్ గ్యాలరీలో నీటిని విడుదల చేస్తున్నాయని, ఫౌండేషన్ గ్యాలరీ డ్రైనేజీ పైపుల నుంచి నీరు సురక్షితంగా వెళ్లేలా చేయాలని సూచించింది. పూడిన డ్రైనేజీ రంధాలను మరమ్మతు చేసి డ్యామ్ గ్యాలరీలో పారుతున్న నీటిని బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మొత్తంగా శ్రీశైలం డ్యామ్ చాలా ప్రమాదకరంగా మారిందని ఆ కమిటీ మరోసారి తేల్చిచెప్పింది. అయినా ఇప్పటివరకు ఏపీ సర్కారు ఆ దిశగా చర్యలు చేపట్టనేలేదు. డ్యామ్ మరమ్మతు పనులకు పూనుకోలేదు.

### సాగర్ డ్యామ్ పనులకూ కొర్రీలు

శ్రీశైలం డ్యామ్ నిర్వహణను గాలికొదిలేసిన ఏపీ సర్కారు మరోవైపు నాగార్జునసాగర్ డ్యామ్ మరమ్మతు పనులు ముందుకు సాగకుండా కొర్రీలు పెడుతుండటం గమనార్హం. ఏబీ పాండ్య కమిటీ సిఫారసులతో గత బీఆర్ఎస్ సర్కార్ వెంటనే రూ.20 కోట్లతో నాగార్జునసాగర్ డ్యామ్ మరమ్మతు చర్యలు చేపట్టింది. అయితే ఏపీ సర్కారు అక్రమంగా డ్యామ్‌ను కుడివైపున 13వ గేట్ వరకు, కుడికాలువ రెగ్యులేటర్‌ను ఆక్రమించుకోవడంతో మరమ్మతు పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నదని ఎన్డీఎస్ఏ కమిటీ తన నివేదికలో వెల్లడించింది. సాగర్ డ్యామ్ వద్ద ఉద్యోగుల కదలికపైనా పరిమితి కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపింది. మరోవైపు తమ భూభాగంలో ఉన్న సాగర్ డ్యామ్ నిర్మాణాలకు సంబంధించిన మరమ్మతులు, నిర్వహణ పనులను తామే చేసుకుంటామని ఏపీ పట్టుబడుతుంది. ఇదే విషయమై ఇటీవల కేఆర్ఎంబీకి లేఖ రాయడం కొసమెరుపు. దీంతో సాగర్ డ్యామ్ పనులపైనా సైతం సందిగ్ధత నెలకొన్నది. ఈ కారణంగా సాగర్ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని తెలుస్తున్నది.

## కాళేశ్వరాన్ని సందర్శించిన ఎన్డీఎస్ఏ

- **అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణులు**
- **పలు అంశాలపై ఇంజనీర్లతో ఆరా**
- **బరాజ్‌ల నిర్మాణంపై సంతృప్తి!**

పెద్దపల్లి, మార్చి 8 (నమస్తే తెలంగాణ)/మంథని రూరల్/కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం ఉదయం అన్నారం, ఆ తరువాత సుందిళ్ల బరాజ్‌ను పరిశీలించారు. అన్నారం బరాజ్ పనులు ఎప్పుడు ప్రారంభించారు? ఎప్పటికి పూర్తయ్యాయి? మొదట సీపేజ్‌లు ఎప్పుడు ఏర్పడ్డాయి? వాటిని ఎలా పూడ్చారు? అని బృందం సభ్యులు ఇంజనీర్లను అడిగినట్టు తెలిసింది. బరాజ్‌లో 2021లో మొదట సీపేజ్‌లు ఏర్పడితే కెమికల్‌తో గ్రౌటింగ్ చేసినట్టు ఇంజనీర్లు వారికి వివరించారు. బరాజ్ 4వ బ్లాక్‌లో 38వ, బ్లాక్ 3లో 38వ, 28వ వద్ద సీపేజ్‌లు పడ్డాయని తెలిపారు. వాటిని హిమాచల్ ప్రదేశ్ నుంచి తెచ్చిన కెమికల్‌తో గ్రౌటింగ్ చేశామని చెప్పారు. అనంతరం వారు గోదావరి నదిని పరిశీలించారు. అక్కడినుంచి బరాజ్ డౌన్ స్ట్రీమ్‌కు వెళ్లి సీపేజ్‌లు ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాగా మధ్యాహ్నం 2.40 గంటలకు సుందిళ్ల బరాజ్‌కు చేరుకున్నారు. బరాజ్ విస్తీర్ణం, పిల్లర్లు, రేడియల్ గేట్లు, నిర్మాణం గురించి ఇంజినీర్లను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి 19 అంశాలను పరిశీలించారు. సాయంత్రం 5.15 గంటల దాకా అక్కడే ఉండి క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించారు. మొత్తంగా బరాజ్ నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ బృందం లో పవర్ రిసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సైంటిస్ట్ యూసీ విద్యార్థి, సీడబ్ల్యూసీ బీసీడీ, డైరెక్టర్ శివకుమార్, రాహుల్ కుమార్ ఉన్నారు.

# మార్చిలోనే రికార్డులు బ్రేక్ చేస్తున్న ఎండలు

- **కొనసాగుతున్న ఎల్-నినో ప్రభావం**
- **ఏప్రిల్ నాటికి ఎల్‌నినో ప్రభావం తగ్గుముఖం**
- **అమెరికా క్లైమేట్ ప్రిడిక్షన్ సెంటర్ వెల్లడి**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): మార్చి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రోజువారీ కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు 4 డిగ్రీల వరకు పెరిగాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే రోజు 35 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఏపీలో పశ్చిమ, దక్షిణ రాయలసీమ ప్రాంతాలు, పశ్చిమ తెలంగాణల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మార్చి నుంచి మే వరకు దేశంలోని చాలా ప్రాంతాల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని హెచ్చరిస్తున్నది. ముఖ్యంగా వేడి తీవ్రత గత ఏడాది కంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నది. మార్చి నుంచి మే వరకు జమ్మూకశ్మీర్, తమిళనాడు మినహా అన్ని ప్రాంతాల్లో హీట్ వేవ్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని సూచించింది. ఎల్-నినో ప్రభావంతో ఈ సారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ చెబుతున్నది. దీని ప్రభావం నిరుడు జూలై నుంచి కొనసాగుతుండగా, వర్షాకాలంలో కరువు వచ్చింది. 2023 ఆగస్టులో వందేండ్లలో ఎప్పుడూ చూడని పరిస్థితి నెలకొన్నది. గత జనవరిలోనూ వర్షాలు పడలేదు సరి కదా శీతాకాలంలో దేశంలోని పలు రాష్ట్రాలు చలితో వణికిపోయాయి. ఏప్రిల్ నాటికి ఎల్-నినో ప్రభావం ముగియనున్నదని అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ క్లైమేట్ ప్రిడిక్షన్ సెంటర్ (ఏఎన్‌వోఏఏసీపీసీ) తెలిపింది.

# వీణవంక తహసీల్దార్ సస్పెన్షన్

**ధరణి నిబంధనలకు విరుద్ధంగా భూ రిజిస్ట్రేషన్**

వీణవంక, మార్చి 8: కరీంనగర్ జిల్లా వీణవంక తహసీల్దార్ తిరుమలరావుపై సస్పెన్షన్ వేటుపడింది. ధరణి నిబంధనలకు విరుద్ధంగా భూమిని రిజిస్ట్రేషన్ చేశాడనే కారణంతో కలెక్టర్ పమేలా సత్పతి సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీణవంకకు చెందిన రామిడి శివప్రియకు సర్వేనంబర్ 1224/ఏలో ఆరు గుంటలు, 1230/21లో 16 గుంటల భూమి ఉన్నది. అయితే ఆమె అమెరికాలో ఉంటున్నారు. ఆమెకు తెలియకుండా వీణవంకకు చెందిన సుకాసి సురేశ్ పేరిట పట్టా చేశారు. ఇందులో శివప్రియ లేకుండానే ఆమె ఫొటోతో సేల్‌డీడ్ చేశారు. ధరణి ఆపరేటర్ అరుణ్‌చౌదరి, సుకాసి సురేశ్, సాక్షులు నీల పున్నం చందర్, అక్బర్ కుమ్మక్కై తాను ఎన్నికల విధుల్లో ఉండగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని తహసీల్దార్ తిరుమలరావు ఇటీవల ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అధికారులు విచారణ జరిపి ఈ వ్యవహారంలో తహసీల్దార్ తప్పిదం ఉన్నదని తేలడంతో తిరుమల్‌రావును సస్పెండ్ చేశారు.


